



# టమాట ₹100

- అదే దారిలో బీర, కాకర, చిక్కుడు
- పైపైకే మిర్చి, కొత్తిమీర, పూదీన
- ఏది కొనాలన్నా అగ్గిలో చెయ్యిపెట్టినట్టే
- ఇంత ధర పెట్టినా కరువైన తాజాదనం
- మార్కెట్‌లో కొనేవారే లేరంటున్న వ్యాపారులు
- కొనేదెట్ల అంటున్న వినియోగదారులు

## భగ్గుమంటున్న కూరగాయల ధరలు

**కూరగాయల ధరలు సెగలు కక్కుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వానకాలం సీజన్ ప్రారంభంలో కూరగాయల ధరలు సహజంగానే పెరుగుతుంటాయి. కానీ, ఈసారి వినియోగదారులు భరించలేని విధంగా ఆకాశాన్నంటుతున్నాయి. ఏది కొనాలన్నా అగ్గిలో చెయ్యిపెట్టినట్టే భగ్గుమంటున్నాయి. పదిహేను రోజుల కిందటి వరకు ₹30 మాత్రమే ఉన్న టమాటా, ఇప్పుడు ఏకంగా సెంచరీకి చేరగా.. దాని వెనుకాలే బీర, కాకర, చిక్కుడు, కాలీఫ్లవర్, మిర్చి, గోరుచిక్కుడు, మునగ పరుగెడుతున్నాయి. కూరగాయల ధరలు విపరీతంగా పెరుగడంతో గిరాకీ లేక వ్యాపారులు దిగులు పడుతుంటే.. ఇంతేసి ధరలుంటే కొనేదెలా..? తినేదెలా? అని వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.**

కరీంనగర్, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : కూరగాయల ధరలు పిరమయ్యాయి. రోజురోజుకూ పైపైకి ఎగబాకుతున్నాయి. వంద రూపాయలు పెట్టనిదే ఏది కిలో వచ్చే పరిస్థితి లేకపోగా.. నానాటికీ పెరుగుతున్న ధరలను చూసి సామాన్యులు, మధ్య తరగతి ప్రజల గుండెలు గుబేల్‌మంటున్నాయి. గతంలో ఏదో ఒక కూరగాయ ధర పెరిగినా.. ఇప్పుడు మాత్రం చాలా రకాల కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. పదిహేను రోజుల కింద ₹500 పట్టుకుని పోతే నాలుగైదు రోజులకు సరిపడా తెచ్చుకునేది. ఇప్పుడు వెయ్యి రూపాయలదాకా పెట్టాల్సి వస్తున్నది. టమాట ధర అయితే విపరీతంగా పెరిగింది. పదిహేను రోజుల్లోనే ₹30 నుంచి ₹100కు చేరింది. మొన్నటి వరకు కిలో టమాటను కొన్నా.. ఇప్పుడు అర్ధకిలో పావుకిలోతో సర్దుకుపోవాల్సి వస్తున్నది. టమాటతోపాటు చిక్కుడు, కాకర, కాలీఫ్లవర్, క్యాప్సికం, క్యారెట్.. ఇలా ఏదికొనాలన్నా కిలోకు వంద రూపాయలు చెల్లించక తప్పని పరిస్థితి ఉన్నది. మిగతావి ఏమన్నా తక్కువగా ఉన్నాయా..? అంటే అదీ లేదు. వీటితోనే పోటీ పడుతున్నాయి. గోరు చిక్కుడు కిలో ₹80, పచ్చి మిర్చి ₹80 నుంచి ₹100, మునగ ₹80కి తక్కువ పలుకడం లేదు. ఇక అలసంద, వంకాయ, దొండ, క్యాబేజీ, చూస్తే ₹40 నుంచి ₹60కి కిలో ఉండగా.. ఈ ధరలను చూసి కనీసం ఆకు కూరలతోనైనా సర్దుకుందామని చూసే సామాన్యులకు నిరాశే మిగులుతున్నది. కిలో పాలకూర ₹80, గంగమాయిలి ₹60, తోట కూర ₹60 పలుకుతున్నది. ఇక కూరల్లో రుచి కోసం వేసుకునే కొత్తి మీర ధర కిలో ₹200 ఉండగా, ₹20కి రెండు పోసలు కూడా రావడం లేదు. పూదీన పరిస్థితి అంతే. కిలో ₹100కు చేరింది. అల్లం, ఉల్లి, వెల్లుల్లి ధరలు కూడా విపరీతమయ్యాయి.

### ఎందుకీ పరిస్థితి?

స్థానికంగా కూరగాయల సాగు తగ్గిపోవడం, ప్రత్యేకంగా వేసవిలో కూరగాయలు పండించే రైతులు లేకపోవడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. వేసవిలో కూరగాయల సాగు రిస్కుతో కూడుకున్న పనని ఎవరూ ఇటు వైపు చూడడం లేదు. ఎండల తీవ్రతను తట్టుకుని దిగుబడి వచ్చే రకాలు కూడా అందుబాటులో లేకపోవడం కూడా మరో కారణంగా చెప్పవచ్చు. స్థానికంగా కూరగాయలు పండించని కారణంగా కరీంనగర్ పట్టణంతోపాటు జిల్లాకు అవసరమైన కూరగాయలను వ్యాపారులు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. అయితే, ఈసారి వేసవిలో అకాల వర్షాలు కురియడంతో కూరగాయ పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఫలితంగా దిగుబడి తగ్గి ఈ పరిస్థితి ఏర్పడిందని స్పష్టంగా తెలుస్తున్నది. అయితే, వేసవిలో కూరగాయల సాగుకు ఉద్యాన శాఖ అధికారులు ప్రణాళికలు చేయకపోవడం కూడా ఒక కారణంగా కనిపిస్తున్నది. రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని పథకాలు కూడా ఉన్నా.. వీటిని ఉద్యాన శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయకపోవడం, సాగు ప్రణాళిక లేక పోవడంతో ఏటా ఈ దుస్థితికి కారణమవుతున్నది.

### మాల్ కొందామంటెనే భయమైతంది

మాల్ కొందామంటెనే మాకు భయమైతంది. టమాట పెట్టే (25 కిలోలు) ఎంతున్నదనుకుంటున్నరు. రూ.1,800 నుంచి రూ.2 వేలు అయితంది. ఇంత ధర పెట్టి మాల్ తెచ్చినంక ఇప్పితే మూడు నాలుగు కిలోలు తరుగస్తది. కూరగాయలు దెబ్బ తింటయి. ఇవన్నీ చూసుకుని మాకు నష్టం లేకుంట అమ్ముకోవాలె. ధర బాగ పెడితే కొనెటోళ్లు ఉండరు. అంతకు ముందు మార్కెట్ల సందులేకుంట మంది ఉండెటోళ్లు. ఇప్పుడు కనిపిస్తంద్రా. పొద్దుగాల, సాయంత్రం గంట, రొండు గంటలు గిరాకీ ఉంటంది. పొద్దుగాల సంది కూసుంటే ఐదు వందలు సుతం గిట్టుతలేవు. వ్యాపారం ఎట్ల చేసుడు..



– శారద, వ్యాపారి

### ఏ ఒక్కటి కొనాలన్నా వంద నోటు ఖతం

ధరలు విపరీతంగా పెరిగినయ్. అంతకు ముందు వారానికి రెండు సార్లయినా మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుక్కుందుము. ఇప్పుడు అడుగు పెట్టాల్నంటేనే భయమైతంది. ఏది కొనాలన్నా వందకు తక్కువ లేదు. మాలాంటి సామాన్యులు బతికే పరిస్థితి లేదు. ఈరోజు ఐదు వందలు పట్టుకుని మార్కెట్‌కు వచ్చిన. నాలుగు ఐటమ్స్ కొనంగనే ఖతమైనయి. ఇంకో కూరగాయ కొనాలని ఉన్నా పైసలు లేక కొంటలేను. ధరలు విపరీతంగా ఉన్నయని మార్కెట్‌కు వచ్చెటోళ్లు లేకుంటయ్యింద్రు.



– కాల్వ అను, చెంజర్ల

### ఇంత పిరం అయితతయనుకోలె..

అబ్బో కూరగాయలు ఇంత పిరం అయితతయని అనుకోలె. కరీంనగర్ వచ్చిన గదా అని కూరగాయలు తీసుకుందామని మార్కెట్‌కు వచ్చిన. రెండు రకాలకు మూడు వందలైనయి. నాకు ఇష్టమైన కూరగాయలు కొనుక్కుడు కాదు. ఏది అగ్గువ ఉన్నదో చూసి కొనాల్సి వస్తంది. కామన్‌గా అందరు టమాట కొంటరు. ఇది ఇప్పుడు కొనలేని పరిస్థితికి వచ్చింది. నిజం చెప్పాల్నంటే ఇప్పుడు ఏ పప్పో, చారో చేసుకొని కడుపు నింపుకోవాలె. ఇంకొద్ది రోజులు పోతే ధరలు తగ్గవచ్చు. కానీ, అంత కాలం బతకాలంటే ఏదో ఒకటి తినాలెకదా?



– బొల్లం జైపాల్ రెడ్డి, మల్లాపూర్ (బోయినపల్లి)



కరీంనగర్ ప్రధాన మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

# అలవెన్స్‌ల కోసం లేని వైకల్యం!



## మరోసారి తెరపైకి ప్రభుత్వోపాధ్యాయుల బోగస్ సరిఫికెట్ల బాగోతం

- వైకల్యం లేకున్నా ఉన్నట్టు నిర్ధారణ పత్రాలు
- ప్రభుత్వ రాయితీలకు ఎసరు
- తాజాగా వెలుగులోకి వ్యవహారం
- ఓ హెచ్‌ఎం ఫిర్యాదుతో విచారణకు డీఈవో ఆదేశం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దందా!
- గతంలో 127 మందిని గుర్తించినా ఆగని అక్రమాలు
- అడుగడుగునా అర్హులైన దివ్యాంగ టీచర్లకు అన్యాయం
- ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లలో ఇబ్బందులు
- పూర్తిస్థాయి విచారణతో అక్రమాలు భారీగా బయటపడే అవకాశం



**పిల్లలను సన్మార్గంలో నడిపించాల్సిన పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. అన్ని అవయవాలు సరిగ్గానే ఉన్నా లేని వైకల్యాన్ని నటిస్తూ.. సర్కారు రాయితీలకు ఎసరు పెడుతున్నారు. బోగస్ వైకల్య ధ్రువీకరణ పత్రాలు పెట్టి అలవెన్సులే కాదు, వక్రమార్గంలో ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు పొందుతున్నారు. ఇలాంటి పంతుళ్ల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా, అర్హులైన దివ్యాంగ టీచర్లు అన్ని రకాలుగా నష్టపోతున్నారు. ప్రధానంగా పదోన్నతులు, బదిలీల్లో భారీగా అవకాశాలను కోల్పోతున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ నీతూకుమారి ప్రసాద్ క్యాంపులు నిర్వహించి.. 127 మంది బోగస్‌గా ఉన్నట్టు తేల్చారు. ఆ తర్వాత అధికారుల నిఘా లోపంతో మరికొంత మంది బోగస్ సర్టిఫికెట్లు పెట్టి భారీగా ప్రయోజనాలు పొందుతూనే ఉన్నారు. తాజాగా ఓ ఉపాధ్యాయుడిపై హెచ్‌ఎం ఇచ్చిన ఫిర్యాదుతో మళ్లీ ఈ బాగోతం వెలుగులోకి రాగా, ఎట్టకేలకు కరీంనగర్ జిల్లా విద్యాధికారి విచారణకు ఆదేశించారు. దీంతో మరోసారి బోగస్ వైకల్య పత్రాల దందా తెరపైకి రావడం ఉపాధ్యాయవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని, అర్హులను గుర్తించి బోగస్‌కు అడ్డుకట్ట వేయాలనే డిమాండ్ వ్యక్తమవుతున్నది.**

కరీంనగర్, జూన్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు కల్పిస్తున్నాయి. ఇవి పొందాలంటే నిబంధనల ప్రకారం 40 శాతం వైకల్యం ఉండాలి. అర్హులైన ఉద్యోగులకు వైకల్య భత్యం కింద ఆరంభంలో నెలకు ₹900 ఇవ్వగా.. 2015 జూలై ఒకటి నుంచి ఆ మొత్తం ₹2వేలకు పెరిగింది. ఆ తర్వాత 2023 జూలై 22 నుంచి జీవోనంబర్ 58 ద్వారా ఈ అలవెన్స్‌ను ప్రభుత్వం ₹3వేలకు పెంచింది. దీంతో పాటు సంబంధిత ఉపాధ్యాయులకు ఏటా ఆదాయపన్ను ₹75వేల నుంచి ₹లక్షా 25వేల వరకు మినహాయింపు లభిస్తున్నది. అలాగే వృత్తిపన్ను మినహాయింపు కూడా కొంత మేరకు వర్తిస్తున్నది. ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లలో ప్రిఫరెన్షియల్ కోటా కింద ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తున్నది. ఆర్టీసీ, రైల్వే ప్రయాణంలో 50 శాతం వరకు రాయితీ, వంటి పలు సదుపాయాలను కల్పిస్తున్నది. ఇటువంటి రాయితీలను పొందేందుకు పలువురు పంతుళ్లు లేని వైకల్యం చూపుతున్నారు. బోగస్ సర్టిఫికెట్లు పెట్టి అలవెన్స్‌లు క్లెయిమ్ చేస్తున్నారు.

### నాడే వెలుగులోకి బాగోతం

ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బోగస్ వైకల్య పత్రాలు పెట్టి రాయితీలు పొందుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 2016లో జిల్లా వికలాంగుల, ఉద్యోగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఆనాటి కలెక్టర్ నీతూప్రసాద్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ మేరకు రంగంలో దిగిన కలెక్టర్, ముందుగా ఆయా శాఖల నుంచి వివరాలు తెప్పించి, ఈ కోటా కింద ఎక్కువగా విద్యాశాఖలో 468 మంది టీచర్లు రాయితీలు పొందుతున్నట్టు గుర్తించారు. సదరు ఉపాధ్యాయులంతా గతంలో మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్లను పక్కన పెట్టి వైకల్య అర్హత గుర్తించేందుకు ప్రవేశపెట్టిన సదరం (సాఫ్ట్‌వేర్ ఫర్ అసెస్‌మెంట్ ఆఫ్ డిసెబుల్డ్ ఫర్ అక్సెస్ రీహాబిలేటేషన్ అండ్ ఎంఫవర్‌మెంట్) సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆనాడు నాలుగు దశల్లో క్యాంపులు నిర్వహించి, అలవెన్స్‌లు క్లెయిమ్ చేస్తున్న వారిలో 127 మంది పంతుళ్లకు వైకల్యం లేదని గుర్తించారు. పెద్దమొత్తంలో బయటపడిన వివరాలను కలెక్టర్.. పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు పంపించారు. బోగస్‌ను తీవ్రంగా పరిగణించిన విద్యాశాఖ కమీషనర్.. సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అప్పటి వరకు తీసుకున్న భత్యాన్ని రికవరీ చేసి ఆ మొత్తాన్ని ట్రెజరీలో జమచేయాలని, బోగస్ పత్రాల ఆధారంగా ఎవరైనా పదోన్నతులు, బదిలీలు ఇతరత్రా లబ్ధిపొందితే ఆ వివరాలు సేకరించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. బోగస్ వైకల్య ధ్రువీకరణ పత్రాలు పెట్టడం క్రమశిక్షణ ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ లెక్కన క్రమశిక్షణ రూల్ 20 ప్రకారం ఎందుకు సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోరాదో పేర్కొంటూ షోకాజ్ నోటీసులు జారీ చేసి, వారి నుంచి పది రోజుల్లో లిఖిత పూర్వక వివరణ తీసుకోవాలని ఆ నాటి విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు విద్యాశాఖ కొన్ని చర్యలు చేపట్టగా.. కొంతమంది కోర్టుకు వెళ్లారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు.. దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు.

### మళ్లీ తెరపైకి.. విచారణకు ఆదేశం

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో ఒక ఉపాధ్యాయుడు బోగస్ వైకల్య పత్రాలను పెట్టి.. అలవెన్స్‌లు పొందుతున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ ఓ ప్రధానోపాధ్యాయుడు కరీంనగర్ జిల్లా డీఈవోకు లిఖతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. నిజానికి హెచ్‌ఎం ఫిర్యాదు విషయంలో ఆలస్యం జరిగినా డీఈవో ఎట్టకేలకు స్పందించి విచారణకు (ఆర్.నంబర్ 1034/ఎ1/2024) ఆదేశించారు. వారం రోజుల్లో విచారణ నివేదిక అందించాలని అందులో స్పష్టం చేశారు. నిబంధల ప్రకారం సదరం జారీ చేసిన వైకల్య పత్రాలను మాత్రమే జతచేయాలి. కానీ, సదరు ఉపాధ్యాయుడు నేటికి గతంలో మెడికల్ బోర్డు జారీ చేసిన పత్రాన్ని పెట్టి అలవెన్స్‌లు యథేచ్ఛగా పొందుతున్నాడని, ఆ ఉపాధ్యాయుడికి కేవలం 40 శాతం మాత్రమే వైకల్యం ఉందని, ఏ కోణంలో చూసిన అర్హుడు కాదని హెచ్‌ఎం తన ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఫిర్యాదుపై డీఈవో స్పందించడంతో మళ్లీ బోగస్ అంశం తెరపైకి వచ్చింది. ఈ తరహా బాగోతం కేవలం ఒక ఉపాధ్యాయుడికి మాత్రమే పరిమితం కాలేదు, చాలా మంది టీచర్లు నేటికి సదరం జారీచేసిన సర్టిఫికెట్లు కాకుండా గతంలో మెడికల్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్ల ఆధారంగానే అలవెన్స్‌లు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలోప్రస్తుతం 1680 మందికిపైగా ఈ తరహా అలెవెన్స్‌లు పొందుతున్నట్టుగా తెలుస్తున్నది.

### పకడ్బందీ విచారణతోనే న్యాయం

మెడికల్ బోర్డు జారీ చేసిన వైకల్య సర్టిఫికెట్లలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని, డబ్బులు ఇస్తే లేని వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఆనాటి ప్రభుత్వం సదరంను తెరపైకి తెచ్చింది. ప్రతి ఉద్యోగి సదరం నుంచి పొందిన సర్టిఫికెట్ సమర్పించాలి. కానీ, నేటికి చాలా మంది మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్ పైనే అలవెన్స్‌లు పొందుతున్నారంటే.. వీటిని ప్రతి నెలా పరిశీలించాల్సిన అధికార యంత్రాగం నిద్రపోతున్నదని స్పష్టమవుతున్నది. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు గుర్తించినా సంఘాల ఒత్తిడితో పట్టించుకోవడం లేదని తెలుస్తున్నది. నిజానికి 2018 జూలైలో జరిగిన బదిలీల సమయంలో బోగస్ వైకల్య పత్రాల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అప్పుడు దీనిపై దాదాపు అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఒక్కటై జేఏసీ ఏర్పాటు చేసుకొని బోగస్ పత్రాలను తొలగించడమే కాకుండా, ఇప్పటికే కొనసాగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు లిఖిత పూర్వంగా ఫిర్యాదు చేశాయి. ఆ మేరకు చర్యలు తీసుకుంటామని, క్యాంపులు నిర్వహిస్తామని చెప్పినా నాటి విద్యాధికారులు.. ఎటువంటి చర్యలు తీసుకోకుండానే చేతులు దులుపుకొన్నారు. నిజానికి ఈ తరహా దందాతో అర్హత ఉన్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్ల సమయాల్లో అన్యాయం జరుగుతున్నది. వైకల్యం సర్టిఫికెట్లు ఉన్న వారికి ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద రిజర్వేషన్లు ఇవ్వడంతో.. మంచి పోస్టులన్నీ అనర్హులకే దక్కుతున్నాయనే విమర్శలున్నాయి. నిజానికి అర్హత ఉన్నవారికి దక్కితే తప్పు కాదు కానీ, బోగస్ సర్టిఫికెట్లు పొందిన వారు భారీగా లబ్ధిపొందుతున్నారు. అలాగే వివిధ అలవెన్స్‌లతో ప్రభుత్వ ఖాజానాకు గండి పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం విచారణ అనేది పకడ్బందీగా నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉండగా.. సదరు ఉపాధ్యాయుడిని కాపాడేందుకు ఒకటి రెండు ఉపాధ్యాయ సంఘాలు ఉన్నతాధికారులపై తీవ్ర ఒత్తిడి పెడుతున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో డీఈవో సదరు టీచర్‌పై చర్యలు తీసుకుంటారా..? లేదా..? అన్నది వేచిచూడాల్సి ఉన్నది. అయితే ఈ విచారణ కేవలం ఒక్కరికి మాత్రమే పరిమితం చేయకుండా, ఉమ్మడి జిల్లాలో మరోసారి క్యాంపు నిర్వహించి, అనర్హులను తొలగించాల్సిన అవసరమున్నదనే డిమాండ్ ఉప్యాధ్యాయుల నుంచి వస్తున్నది. అప్పుడే అర్హత ఉన్న టీచర్లకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.



గంగాధర మండలం బూరుగుపల్లి జడ్పీ స్కూల్‌ను డీఈవో జనార్దన్ తనిఖీ చేస్తుండగా పుస్తకాల బ్యాగులతో కనిపించిన విద్యార్థులు

# నో బ్యాగ్ డే.. ఏమైంది?

కమాన్‌చౌరస్తా, జూన్ 22: విద్యార్థులపై బడి సంచి భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం గత విద్యాసంవత్సరం నుంచి ప్రతినెలా నాలుగో శనివారం 'నో బ్యాగ్‌డే'ను అమల్లోకి తెచ్చింది. స్కూల్ బ్యాగు పాలసీ–2020 ప్రకారం ఏడాదిలో పది రోజులు పకడ్బందీగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ప్రతి నెలా నాలుగో శనివారం ఒకటి నుంచి టెన్త్ క్లాస్ విద్యార్థుల వరకు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టాలో నిర్దేశిస్తూ ఎన్సీఈఆర్టీ ప్రత్యేక పుస్తకాన్ని ముద్రించింది. అందులో 28 కృత్యాలను పొందుపరిచింది. వీలును బట్టి చేయించాలని సూచించింది. మ్యూజియం, చారిత్రక ప్రదేశాలు, గ్రామ పంచాయతీలు వంటి కార్యాలయాల సందర్శన, సైన్స్ ప్రయోగాలు, బాలికా విద్యపై స్కిట్, పతంగుల తయారీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మ్యాథ్స్ కార్నర్, మ్యాథ్స్ రంగోలి, మోడల్ ఎన్నికలు, మాక్ అసెంబ్లీ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, బేస్డ్ లెర్నింగ్ లాంటి కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలి. కానీ, ఈ యేడాది మొదటిలోనే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అందుకు ఎగనామం పెట్టారు. అయితే, ఈ నాలుగో శనివారం గంగాధర మండలం బూరుగుపల్లి, రామడుగు మండలం వెదిర జడ్పీ పాఠశాలలను కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంలో విద్యార్థులు బ్యాగులతో కనిపించినా పట్టించుకోలేదని తెలుస్తున్నది.

# బస్టాండ్‌లో పుట్టిన చిన్నారికి లైఫ్‌టైం ఫ్రీ బస్‌పాస్

తెలంగాణచౌక్,జూన్ 22: కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో జన్మించిన ఒడిశాకు చెందిన చిన్నారికి లైఫ్‌టైం ఫ్రీ బస్‌పాస్‌ను మంజూరు చేశారు. శనివారం ఆర్‌ఎం సుచరిత డిప్యూటీ ఆర్‌ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణతో కలిసి కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారి తల్లికి అందజేశారు. ఈ నెల 16న ఒడిశా రాష్ట్రానికి చెందిన కుమారి భర్త దులాతో కలిసి డెలివరీ కోసం సొంతూరికి వెళ్లేందుకు కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు కోసం ఎదురుచూస్తుండగా కుమారికి పురిటి నొప్పులు వచ్చాయి. గమనించిన బస్టాండ్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పురుడు పోయగా పాపకు జన్మనిచ్చింది. ఇటీవల పురుడు పోసిన సిబ్బందిని ఇటీవల ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందించి చిన్నారికి లైఫ్‌టైం ఫ్రీ బస్సు పాస్ అందించాలని ఆదేశించారు. ఈ మేరకు కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారి తల్లికి ఆర్‌ఎం సుచరిత బస్‌పాస్‌తో రూ. 14 వేల నగదు, నూతన వస్త్రాలు అందజేశారు.



చిన్నారి తల్లికి జీవితకాల ఉచిత బస్‌పాస్‌ను అందిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం సుచరిత

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571